క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భావన

బోట్‌క్లబ్: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10. 30 గంటల వరకూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ఆరుగురు ఫోన్‌లో తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ భావన ప్రజలు నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్, పెన్షన్ వంటి విభాగాలకు సంబంధించి 21 సమస్యలతో కూడిన అర్జీలను ప్రజలకు కమిషనర్‌కు అందించారు. ప్రజా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని ఆమె అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకట్రావు, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

రేపు శాంతియుత ధర్నా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విజయవాడలో బుధవారం నిర్వహించే శాంతియుత ధర్నాకు గ్రంథాలయ శాస్త్ర నిరుద్యోగులందరూ హాజరుకావాలని గోదావరి లైబ్రేరీసైన్స్ అసోషియేషన్ కార్యదర్శి కె.సాయిబాబు సోమవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయ శాస్త్రంలో విద్యను అభ్యసించిన ప్రతి ఒక్కరూ హాజరై తమ గళం విప్పాలని, దశాబ్దాల కాలంలో గ్రంథాలయ విభాగ పోస్టులు భర్తీ చేయకుండా వాటిని నిర్వీర్యం చేస్తున్న తరుణంలో ధర్నాలో పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ గాంధీనగర్ ధర్నా చౌకలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నిర్వహిస్తారని తెలియజేశారు.

12న కవి సమ్మేళనం

బోట్‌క్లబ్: సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఈ నెల 12న సాయంత్రం స్థానిక సుందరయ్య భవన్‌లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాం ఏచూరి- సమ సమాజ ఆలోచన అనే అంశంపై ఈ కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. సాహితీ ప్రియులందరూ పాల్గొనాలని కోరారు.

ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించరా?

బోట్‌క్లబ్: పోలీస్ అథారిటీ చిరునామాలను ఫోన్ నంబర్లతో సహా ప్రతి పోలీస్ స్టేషన్‌లో అందరికీ కనిపించేలా పెట్టాలని ఏడాది క్రితం డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. వాటిని ఇప్పటికీ ఎవరూ పాటించడం లేదని పోలీస్, ఇతర బాధితుల సంక్షేమ సంఘం కన్వీనర్ మెర్ల శాస్తులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఆలయాల్లో సంప్రోక్షణ



రామారావుపేట శివాలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

బోట్‌క్లబ్: చంద్రగ్రహణం అనంతరం నగరంలోని పలు ఆలయాల్లో సంప్రోక్షణ నిర్వహించి, ఉదయం 10 గంటలకు ఆలయాలు తెరిచారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. చంద్రగ్రహణం కారణంగా పలు రాశులు, నక్షత్రాల జాతకులు శాంతి హోమాల కోసం ఆలయాల్లో అర్చకులకు దానాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. రామారావుపేట శివాలయం, బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయం, బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంతోపాటు పలు ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి



రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీడీపీఓ లక్ష్మి

కాకినాడ రూరల్: సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉంటూ విద్యను అభ్యసించాలని ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో ఏపీఐఐసీ కాలనీలో జరిగిన సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆరు ఏళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బొమ్మలు, వివిధ రకాల ఆట వస్తువులతో విద్యను అందిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆరు ఏళ్ల పైబడిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రులు చేర్పించాలన్నారు. కార్యక్రమంలో మజీ సర్పంచ్ రత్నప్రసాద్, డాక్టరు శిరీష, సుబ్బారావు, శ్రీనగేష్, సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌గా వదిలేశారు..!

సర్పవరం జంక్షన్‌లో ఉన్న బోట్‌క్లబ్ పార్కును స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేశారు. దీనిలో భాగంగా ఓపెన్ జిమ్‌లను మగవారికి ఒకటి, ఆడవారికి మరొకటి ఏర్పాటు చేశారు. అయితే ఈ మహిళా జిమ్‌ను తొలగించారు. ఎందుకంటే ఈ జిమ్ స్థలంపై ప్రైవేట్ వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు ప్రకారం ఆ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. అయితే దీనిపై ప్రజలకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా పోరాడిన కార్పొరేషన్ అధికారులు ఇప్పుడు వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- బోట్‌క్లబ్‌లో ఓపెన్ జిమ్ తొలగింపు
- రూ.కోట్ల విలువైన స్థలం ప్రైవేట్ పరం?
- న్యాయ స్థానంలో ప్రైవేట్ వ్యక్తికి అనుకూలంగా తీర్పు
- ఆకస్మాత్తుగా అధికారులు వెనకంజ వేయడంతో అనుమానాలు



బోట్‌క్లబ్ పార్కులో ప్రహరీ నిర్మించి గ్రావెల్ నింపిన ఓపెన్ జిమ్ ప్రాంతం

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో ఉన్న బోట్‌క్లబ్ పార్కుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్, పచ్చదనం, విశాలమైన మైదానం, అందమైన కొలను ఉండడంతో ఆహ్లాదకర వాతావరణం ఉండేది. ఇది కూడలిలో ఉండడంతో ఎంతోమంది ఇక్కడకు వచ్చి సేద తీరేవారు. ఉద్యోగులు కబురులు చెప్పుకొంటూ, విద్యార్థులకు ఆటవిడుపుగా ఉండేది. సర్పవరం జంక్షన్ వద్ద రమణయ్యపేట కూరగాయలు, చేపల మార్కెట్ నుంచి దాదాపు ఆశ్రమ పబ్లిక్ స్కూల్ సమీపం వరకు పార్కు స్థలం విస్తరించి ఉండేది. ఈ స్థలంపై చాలా మంది కన్నుపడింది. గతంలో బోట్‌క్లబ్‌ను ఆనుకుని ఉన్న చేపల మార్కెట్ తొలగించే ప్రయత్నాలు జరిగాయి. అవి సాధ్యపడలేదు. తాజాగా చేపల మార్కెట్ పక్క నుంచి ప్రహరీ తొలగించి లోపల కొద్ది భాగంలో గ్రావెల్ నింపి ప్రైవేట్‌గా ప్రహరీని నిర్మించారు. బోట్‌క్లబ్ అభివృద్ధి పనుల్లో భాగంగా స్మార్ట్ సిటీ నిధులను కేటాయించి ఓపెన్ జిమ్‌లను మగవారికి ఒకటి, ఆడవారికి మరోకటి ఏర్పాటు చేశారు. ఈ మహిళా జిమ్ ప్రైవేట్‌గా ప్రహరీ నిర్మించిన చోటే ఉంది. దీనిపై న్యాయ స్థానంలో ప్రైవేట్ వ్యక్తి అనుకూలంగా ఇంజెక్షన్ ఆర్డర్ రావడంతో కార్పొరేషన్ అధికారులు తొలగించారు.



బోట్‌క్లబ్ పార్కులో ప్రహరీ నిర్మించిన స్థలం



బోట్‌క్లబ్‌లో ఓపెన్ జిమ్ తొలగింపుతో మూలకు చేరిన జిమ్ సామగ్రి లేని సిమెంట్ దిమ్మలు

ఇదీ విషయం

కాకినాడ నగరంలో రమణయ్యపేటలోని బోట్‌క్లబ్ పార్కు ఒకటో డివిజన్ పరిధిలో ఉంది. నగరపాలక సంస్థ పర్యవేక్షణలో పార్కు నిర్వహణ జరుగుతోంది. సర్వే నంబరు 82/1లో 550 గజాల స్థలం తమదని ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో దాదాపు 8 ఏళ్లకు పైగా వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఈ కేసు హైకోర్టు వరకూ నడిచింది. కోర్టులో బోట్‌క్లబ్‌లో ఓపెన్ జిమ్ ఉన్న ప్రాంతం ప్రైవేట్ వ్యక్తికి అనుకూలంగా తీర్పు రావడంతో అధికారులు సడన్‌గా జిమ్ తొలగించి అప్పగించారు.

కూటమి అధికారంలోకి రావడంతో..

విలువైన కమర్షియల్ స్థలం కావడంతో బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.2.5 కోట్లు వరకు దీని విలువు ఉంటుంది. దాదాపు ఎనిమిదేళ్లుగా ప్రైవేట్ వ్యక్తితో న్యాయ స్థానంలో పోరాడిన కార్పొరేషన్ అధికారులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మిన్నకుండిపోవడంతో అనుమానాలకు తావిస్తోంది. తదుపరి చర్యలు కోసం పై న్యాయ న్యాయ స్థానాన్ని ఆశ్రయించాల్సి ఉంది. కార్పొరేషన్ అధికారులు ఆ ప్రయత్నం చేయకపోవడంపై మరింతగా విమర్శలు వినిపిస్తున్నాయి. పార్కులో గజం స్థలం కూడా ప్రైవేట్ పరం కాకుండా చూడాలని ప్రజా ప్రయోజనాలు ముఖ్యమని నగరవాసులు చెబుతున్నారు.

న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తాం

ఈ విషయంపై కాకినాడ కార్పొరేషన్ డీసీపీ కృష్ణారావు వివరణ కోరగా కోర్టులో బోట్‌క్లబ్‌లో స్థలం వివాదం కోర్టులో ఉండడంతో ప్రైవేట్ వ్యక్తికి అనుకూలంగా తీర్పు ఉంది. దీనిపై తదుపరి చర్యలు కోసం న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తున్నామన్నారు.

ప్రజల ఆస్తిని రక్షించాలి



బోట్‌క్లబ్ పార్కు పబ్లిక్ ప్రోపర్టీ. దానిని పరిరక్షించుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది. అధికారులు కోర్టులో పోరాటం సాగించి, స్థలం సాధించాలి. అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకూడదు. దీనిపై పోరాటం చేయాలి.

– చింతపల్లి సుబ్బారావు, జిల్లా గ్రంథాలయ సంఘ కార్యదర్శి, కాకినాడ

ఓపెన్ జిమ్ తొలగింపు దారుణం



బోట్‌క్లబ్‌లో ఓపెన్ జిమ్ తొలగింపు దారుణం. న్యాయం స్థానం తీర్పునకు గౌరవం ఇవ్వాలి. అయితే విలువైన స్థలం కాపాడాల్సిన బాధ్యత కార్పొరేషన్ కమిషనర్‌పై ఉంది. తక్షణమై న్యాయ స్థానంలో డిక్లెరేషన్‌కు వెళ్లడంతో పాటు మహిళలకు తాత్కాలికంగా ప్రత్యామ్నాయంగా జిమ్ ఏర్పాటు చేయాలి.

– బుద్ధరాజు సత్యనారాయణ రాజు, సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు

పెద్దమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి

రంపచోడవరం ఐటీడీఏలో విలీనం చేయాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పెద్దమల్లాపురం గ్రామస్తులు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): జిల్లాలోని శంఖవరం మండలంలోని పెద్దమల్లాపురంను కేంద్రంగా చేసి మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ గిరిజనులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు గిరిజన సంస్కృతిక సంప్రదాయాలతో జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోదొడ్డి సర్పంచ్ లోత రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలో భాగంగా కాకినాడ జిల్లాలో ఉన్న సబ్ ప్లాన్ గిరిజన గ్రామాలైన 59 గ్రామాలను కలుపుకొని పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏలేశ్వరంలో జరిగిన ఎన్నికల సభలో ఇప్పటి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బహిరంగంగా హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేసి ఆ ప్రాంత గిరిజనుల చిరకాల కోరిక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గిరిజనలైనప్పటికి 5వ షెడ్యూల్లో లేకపోవడంతో గిరిజనులకు రక్షణ చట్టం, పీసా చట్టం, ఆదివాసీల రిజర్వేషన్ వర్తింపజేయకపోవడంతో భూమి మీద రక్షణ లేదని, గ్రామ సభలకు అధికారం లేదన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు లేకపోగా ఐటీడీఏ ఫలాలు అందక ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నామని ధ్వజమెత్తారు. పెద్ద మల్లాపురం మండల సాధన కమిటీ నాయకులు ముసలయ్య బాలరాజు, జర్త సరస్వతి, కించి అప్పలకొండ, గ్రామ సర్పంచులు గుండు చెంచుబాబు, గంగరాజు మాట్లాడుతూ గత 40 ఏళ్లగా ఇదే డిమాండ్ కోసం ఉద్యమాలు చేస్తున్నామని 1999 అసెంబ్లీ ఎన్నికల్లో బ్యాలెట్ బాక్స్‌లో ఓటుతోపాటు పెద్ద మల్లాపురం మండల కేంద్రం చేయాలని స్లిప్పులు వేయగా కౌంటింగ్‌లో వాటిని లెక్క వేయగా 16వేలు వచ్చాయన్నారు. తాము సబ్-ప్లాన్ ఏరియాలో ఉండడం వల్ల కులధృవీకరణ, ఉద్యోగావకాశాలు, వైద్యం పూర్తి స్థాయిలో అందడంలేదని వాపోయారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్ గిరిజన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, నాగేశ్వరావు, దొంగబ్బాయి, చిన్నయ్య, సత్తిబాబు, చెల్లారావు పాల్గొన్నారు.

ప్రజా కళకు ఊపిరి గరికపాటి జీవితం

పెద్దాపురం: ప్రజా కళాకారులకు ఊపిరి పోసిన గరికపాటి రాజారావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కళాకారులు పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం గరికపాటి 62వ వర్ధంతి సభ ప్రజా నాట్యమండలి మండల కార్యదర్శి డి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాహితి స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాల ప్రారంభ సమయంలో సంస్కృత వ్యవస్థను ఆయన ప్రారంభించారన్నారు. సమసమాజ భావ జాలంతో కళను, కళారూపాలను తీర్చిదిద్దిన ఘనత గరికిపాటికే దక్కిందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ఎం నాయకులు రొంగల వీర్రాజు, డి.కృష్ణ, మహపాలిన రాంబాబు, భజన సంఘం నాయకులు నీలం శ్రీను, సిరిపురపు శ్రీనివాస్, గూనూరి రమణ, ఎన్.నరసింహమూర్తి పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మూడు రోజులపాటు పంచాయతీ కార్యదర్శులకు టీఓటీలుగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ ఎంపీడీఓ కె.శేషుబాబు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతిపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో ఎంపికై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ మేరకు మూడు రోజుల పాటు శిక్షణ కేంద్రంలో భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలు తీర్చడానికి కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకలీలు వి.జగ్గన్నాథం, ఎం.రాజ్‌కుమార్, కేఆర్ నిహారిక పాల్గొన్ని శిక్షణ నిర్వహించారు.

రాజ్యాంగ పరిరక్షణకు మహా పాదయాత్ర

ఘన స్వాగతం పలికిన ఎస్సీ సంఘాల నాయకులు



కాకినాడ చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ మహాపాదయాత్ర సభ్యులు

బోట్‌క్లబ్: కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఎస్సీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ మహాపాదయాత్ర సోమవారం కాకినాడకు చేరుకుంది. ఇంద్రపాలెం అంబేడ్కర్ సర్కిల్ వద్ద స్థానిక ఎస్సీ సంఘాల నాయకులు ఈ యాత్రకు ఘన స్వాగతం పలికారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్ర భానుగుడి సెంటర్ వరకూ కొనసాగింది. పాదయాత్రకు ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర దేశ రాష్ట్ర రాజకీయాల్లో గొప్ప మలుపులు తీసుకొస్తుందన్నారు. దళితులను విభజించు పాలించు అన్న ఆలోచన మంచిది కాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణ పొరపాటు నిర్ణయమని, దళితుల గురించి పూర్తి అవగాహన లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారన్నారు. వెంటనే ఈ తప్పిదాన్ని సరిదిద్దుకోవాలని కోరారు. రెండు రోజుల వ్యవధిలో ఎస్సీ వర్గీకరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రతో దళితులను విభజిస్తున్నారన్నారు. దళితులు ఐక్యంగా ఉంటే ఏమైనా సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, పీవీరావు మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్‌కుమార్ రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, ఎస్సీ సంఘాల నాయకులు శివ ప్రసాద్, మేఘరాజు పాల్గొన్నారు.

దాతలే అతిథులుగా...



విద్యార్థులతో సతీష్, దాతలు

కాకినాడ క్రైం: తండ్రిని కోల్పోయి పేద, నిరుపేద పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందజేస్తున్న కాకినాడకు చెందిన యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ 12వ వార్షికోత్సవం రామారావు ఎటలోని ఒక హోటల్‌లో ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాతలే అతిథులుగా పాల్గొన్నారు. సతీష్ మాట్లాడుతూ 90 మంది విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాదిలో రూ.25 లక్షల మొత్తాన్ని ఫీజులు చెల్లించేందుకు వెచ్చించామన్నారు. ఈ వేదికపై కాకినాడ రూరల్ రేవూరుకి చెందిన ఆరేళ్ల బాలుడు కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా అప్పటికప్పుడు రూ.1.5 లక్షల మొత్తాన్ని బాలుడి వైద్యానికి చెల్లించేందుకు దాతలు సిద్ధమయ్యారు. నున్న దొరబాబు, సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణ రెడ్డి దంపతులు, ద్వారంపూడి వీరభద్రారెడ్డి దంపతులు, సోము స్వాతి, రాజ్‌కుమార్ దంపతులు, తోట పృథ్వీరాజ్, డాక్టర్ సురేఖ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమార రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతైన రోజు సోమవారం కావడంతో ఆలయంలోని కుమార రామభీమేశ్వర స్వామివారికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారికి అర్చకులు అభిషేకాలు పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలైనులో వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి ఆలయ పుష్కరిణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శనగలు, పులిహోర ప్రసాదాలను పెట్టారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. పూజలు అనంతరం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

మాండవ్య నారాయణుని గ్రామోత్సవం

సామర్లకోట: పట్టణంలోని అతిపూరాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణ స్వామి గ్రామోత్సవం సోమవారం ఘనంగా సాగింది. ప్రతి నెల పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సమూర్తులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ప్లైఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, పెద్దవీది, చిన్నవీధి, యార్లగడ్డ వారి వీధి, దేవిచౌక్ మీదుగా గ్రామోత్సవం సాగింది.

కన్నబాబును కలిసిన రఘురామ్



ఒమ్మి రఘురామ్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటరు, కాకినాడ రూరల్ నియోజకవర్గ సమన్వయ కర్త కురసాల కన్నబాబును కాకినాడ వైద్యనగర్ నివాసంలో ఇటీవల పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నిమితులైన ఒమ్మి రఘురామ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కార్యదర్శితోపాటు కాకినాడ రూరల్ పరిశీలకుడిగా నియమితులైన రఘురామ్‌ను కన్నబాబు అభినందించి, శాలువాతో సత్కరించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో జేసీఐ ప్రతినిధి డాక్టరు తన్మయి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో 17మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు అందుకున్నారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) కాకినాడ పోర్టు వారి సహకారంతో హెచ్ఎం గాయత్రి సమక్షంలో సోమవారం 17మందికి రూ.3వేలు చొప్పున రూ.51వేలు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. పది, ఇంటర్‌లో 65శాతం మార్కులు సాధించిన విద్యార్థులను స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేశామని, వచ్చే సంవత్సరం మరింత మందికి ప్రోత్సాహం అందజేస్తామని జేసీఐ కాకినాడ పోర్టు అధ్యక్షురాలు డాక్టరు తన్మయి తెలియజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జి సత్యవోలు శ్రీనివాస్, ఇంటర్మీడియెట్ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజు, ఉపాధ్యాయులు చామంతి నాగేశ్వరరావు, మూర్తి, కృష్ణవేని తదితరులు పాల్గొన్నారు.

డ్రైనుకు శంకుస్థాపన

సామర్లకోట: స్థానిక రెండవ వార్డు సంత మార్కెట్ రోడ్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.2.70 లక్షలతో నిర్మాణం చేసే డ్రైను పనులకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పాలిక కుసుమ సోమవారం శంకుస్థాపన చేశారు. దీర్ఘకాలికంగా డ్రైను నిర్మాణం చేయకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. కౌన్సిల్ సమావేశంలో సమస్యను వివరించడంతో నిధులు మంజూరు కాగా పనులకు శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నరసింహరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పాలిక చంటిబాబు, టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాపై పన్నులు తగ్గించాలి

కొత్తపల్లి: ఆక్వా ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం పన్ను తగ్గించాలని రైతు సంఘం నాయకుడు గుర్రాల అప్పారెడ్డి అన్నారు. మండలంలోని ఆక్వా రైతులను సోమవారం కలిసి ఈ నెల 11 తేదీన విజయవాడలో జరగబోయే ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. అప్పారెడ్డి మాట్లాడుతూ ఆక్వా రైతుల సమస్యలపై సదస్సులో చర్చిస్తామన్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో ఆక్వా, చేపల పెంపకం చేస్తున్నారు. తీర ప్రాంతంలో రొయ్యల పరిశ్రమలు, హేచరీలపై ఆధారపడి వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ విధంగా సుంకాలు విధించడంతో ఆక్వా రైతులు పూర్తిగా నష్టపోతారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకట సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.